క్లుప్తంగా

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి

కుదురుమల్ల మాజీ సర్పంచ్ రఘుపతి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

దుద్యాల్: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కుదురుమల్ల మాజీ సర్పంచ్ రఘుపతి పేర్కొన్నారు. ఆదివారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు గ్రామస్తులతో కలిసి ముగ్గుపోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్లు మంజూరు చేయాలంటే కాంగ్రెస్ హయాంలోనే సాధ్యమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు ఒక్క ఇళ్లు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు యాదవరెడ్డి, నాయకులు రమేశ్ గౌడ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

హథీరామ్ భవోజీ మఠం పునరుద్ధరించాలి

గిరిజన ఉద్యోగ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిశ్చందర్‌నాయక్

పరిగి: తిరుపతిలోని హథీరామ్ భవోజీ మఠాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ గిరిజన ఉద్యోగ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిశ్చందర్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లంబాడీల ఆరాధ్య దైవం హథీభవోజీ వేంకటేశ్వరస్వామికి పవిత్రమైన భక్తుడని పేర్కొన్నారు. ఆయన స్వామివారికి మొదటి పూజ చేసేవారని అందుకే ఆలయం దగ్గర్లోనే హథీరామ్ మఠాన్ని ఏర్పాటు చేశారని వివరించారు. కాని కుట్ర పూరితంగా ఆ మఠాన్ని తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీ బోర్డులో లంబాడీలకు అవకాశాం కల్పించి, మఠం ఆస్తులను కూడా పరిరక్షించేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ధారూరు: మండల కేంద్రంలో పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ధారూరు బాలుర ఉన్నత పాఠశాలలో 2003–04లో పదోతరగతి చదువుకున్న వారంతా సమావేశమై తమ పూర్వ గురువులకు శాలువా కప్పి, పూలమాలలు వేసి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో చేసిన అల్లరిపనులను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

చాతుర్మాస్య యజ్ఞం ప్రారంభం



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

కేశంపేట: మండల కేంద్రంలోని శ్రీశివ సీతా రామాంజనేయస్వామి దేవాలయంలో చాతుర్మాస్య యజ్ఞం కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. యజ్ఞం ప్రతీ సంవత్సరం ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ద్వాదశి (4 నెలలు) వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజు ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు, భక్తుల సాయంతో నిర్వహిస్తామని తెలిపారు. నాలుగు నెలల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో గ్రామస్తులతో పాటుగా సమీప గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విశ్వనాథం, మాజీ సర్పంచ్‌లు శ్రీధర్‌రెడ్డి, తలసాని వెంకట్‌రెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ మఠం చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు యాదయ్య, విజయరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అనసూయ, బాల్‌రెడ్డి, రాఘవేందర్, నర్సింహ, శేఖర్ పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అన్నారంలో ఆదివారం డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అదేవిధంగా గ్రామంలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, శివశంకర్, వినోద్‌కుమార్, కృష్ణయ్య, ప్రశాంత్, విష్ణు, శ్రీనివాస్, మహేశ్‌నాయక్ పాల్గొన్నారు.

ఆ రోడ్డు గుంతలమయం



కంకర తేలిన పాలేపల్లి, ఐనాపూర్ బీటీ రోడ్డు

- మరమ్మతులకు నోచుకోని పాలేపల్లి, ఐనాపూర్ బీటీ రోడ్డు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

దోమ: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. పలు గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. కంకరతేలి, గుంతల రోడ్లపై ప్రయాణించాలంటే అతి కష్టం మీద వెళ్లాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో గత పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా నేటికి గ్రామీణ రోడ్లను పట్టించుకునే వారు కరువయ్యారు.

చీకటైతే నరకం

దోమ మండల పరిధిలోని పాలేపల్లి మీదుగా ఐనాపూర్ వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు కంకర తేలి గుంతలుగా మారింది. దీంతో అటుగా వెళ్లే మల్లేపల్లి, దాదాపూర్, కొత్తపల్లి, గుండాల ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆ రోడ్డుపై కంకర, గుంతలు ఉండడంతో వాహనదారులు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు. చీకటైతే మాత్రం నరకం అనుభవిస్తున్నారు. ఆ రోడ్డు గుండా వెళ్లాలంటే ప్రాణం అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేస్తున్నామని చెబుతున్నారు.

ప్రభుత్వం ఏర్పాటై..

గత ప్రభుత్వం గ్రామీణ రోడ్లపై దృష్టి సారించకపోవడంతో ఇబ్బందులు ఎక్కువయ్యాయని పలువురు వాపోతున్నారు. కానీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తయినప్పటికీ గ్రామీణ రోడ్లను పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామీణ రోడ్లపై దృష్టి సారించి త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

"ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని..



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తయినా రోడ్ల దశ మారడం లేదు. పాలేపల్లి నుంచి ఐనాపూర్ వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు కంకర తేలడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు ప్రయాణించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవలే ఓ వ్యక్తి పరిగి పట్టణం నుంచి ఐనాపూర్ గ్రామానికి వస్తుండగా కంకర తేలిన రోడ్డుపైనుంచి ప్రయాణం చేసి కిందపడి గాయాలపాలయ్యాడు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లను మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలి.

–మేకల యాదయ్య, బీజేపీ జిల్లా కార్యదర్శి

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న రాములు

ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములు

దోమ: క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం చేకూరుతుందని మాజీ ఎంపీటీసీ రాములు పేర్కొన్నారు. ఆదివారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో యువకులు నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం విజేతలకు ఎంపీటీసీ రాములు నగదు బహుమతి అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడా కారులు రాజేశ్‌యాదవ్, రాములు యాదవ్, విజయ్‌యాదవ్, షాకేర్, జగన్, నరేందర్, ఉవగుంట యాదయ్య, రాజు, నవీన్, భీమయ్య, లోకేశ్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, మహేశ్‌లక్కీ, సురేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐ రమేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కుల్కచర్ల: అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం కేసు విచారణలో నిందితులను సత్వరమే పట్టుకోవడంతో మండల దళిత సంఘాల నాయకులు, బహుజన సంఘాల నాయకులు కుల్కచర్ల ఎస్‌ఐ రమేశ్‌ను ఘనంగా సన్మానించారు. ఆదివారం కుల్కచర్ల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మండల దళిత సంఘాల అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నిందితులను త్వరితగతిన పట్టుకోవడం అభినందనీయమన్నారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు కీలకంగా వ్యవహరిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు, మాజీ ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, ఏబీసీసీ నాయకులు రాములు, బహుజన సంఘాల ఐక్యవేదిక నాయకులు రామన్నమాదిగ, నాయకులు జోగు వెంకటయ్య, బిచ్చయ్య, తుప్పలి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘసంస్కర్త



పరిగి: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



అనంతగిరి: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరిగి: కులరహిత సమాజం కోసం పోరాడిన గొప్ప సంఘసంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ అని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మాజీ ఉపప్రధాని, సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఆయన దేశానికి చేసిన సేవ మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఆయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి

అనంతగిరి: జగ్జీవన్‌రాం ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. వికారాబాద్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, మాజీ కౌన్సిలర్ మురళి, మాజీ ఎంపీపీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: నివాళులర్పిస్తున్న నాయకులు

కుల్కచర్లలో..

కుల్కచర్ల: చౌడాపూర్ మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పర్గి అశోక్, ప్రభు, భరత్, కోస్గి కుమార్, బి.వెంకటేశ్, మొగులయ్య, తదితరులు పాల్గొన్నారు.

చర్చలకు అసెంబ్లీకే రావాలి

మొయినాబాద్‌రూరల్: కేటీఆర్ ధైర్యం ఉంటే రాష్ట్ర అసెంబ్లీని వేదిక చేసుకోవాలని లేదంటే మానుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను కాంగ్రెస్ ఎండగడుతుందని గుర్తుచేశారు. ఏదీఏమైనా కాంగ్రెస్ 16 నెలల్లోనే ప్రజలకు ఆర్థికంగా చేయూతనిస్తూ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంతో కృషి చేస్తోందన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రంలో జరిగిన ఖర్గే మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను వక్రీకరించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ధైర్యం ఉంటే రాష్ట్ర అసెంబ్లీ వేదికగా తీసుకొని ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఉండి చర్చించాల్సిన బాధ్యత ఆయనదని గుర్తుచేశారు.

నేడు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

యాలాల: మండల కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మండల ఇన్‌చార్జి మెట్లి సూర్యప్రకాశ్, దౌల్తాబాద్ మండల ఎంఎస్పీ ఇన్‌చార్జి డప్పు మహేందర్ తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద జెండావిష్కరణ ఉంటుందని తెలిపారు.

బస్సులు నడిపించండి

ఆర్టీసీ అధికారులకు ఎంఈఓ రాంరెడ్డి వినతి

కొడంగల్: మండల పరిధిలో పలు గ్రామాల నుంచి కొడంగల్‌కు వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులు బస్సులను నడిపించాలని ఎంఈఓ రాంరెడ్డి కోరారు. మండలంలో ఐదువేలకు పైగా జనాభా ఉన్న రుద్రారం గ్రామానికి పాఠశాలకు వెళ్లే సమయంలో బస్సులు లేవని తెలిపారు. విద్యార్థులు కొడంగల్‌కు వచ్చి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. రుద్రారంతో పాటు నీటూరు, అప్పాయిపల్లి గ్రామాలకూ బస్సు సౌకర్యం లేదన్నారు. ఆయా గ్రామాలకు ఉదయం 8.45నుంచి సాయంత్రం 4.40 నిమిషాలకు బస్సులు నడిపించాలని తాండూరు డిపో మేనేజర్‌కు కోరినట్లు తెలిపారు. పాఠశాల వేళల్లో ఉదయం ఒక ట్రిప్పు, సాయంత్రం మరో ట్రిప్పు నడిపిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. కొడంగల్ నుంచి రుద్రారం వెళ్లే మార్గంలో చిట్లపల్లి, సంగాయిపల్లి, అంగడిరాయిచూర్, లక్ష్మీపల్లి, టేకుల్‌కోడ్, అన్నారం, నాగారం గ్రామాలు ఉన్నాయి. బస్సును నడిపించడం వల్ల ధర్మాపూర్, పాటిమీదిపల్లి గ్రామాల విద్యార్థులకు ప్రజలకు కూడా సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు.

శునకాలకు టీకాలు తప్పనిసరి



షాద్‌నగర్‌రూరల్: యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- గ్రామాల్లో రేబిస్ వ్యాక్సినేషన్ శిబిరాలు ప్రారంభం

షాద్‌నగర్‌రూరల్: ఇండ్లల్లో, ఫామ్‌హౌస్‌లలో ఉన్న పెంపుడు శునకాలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ప్రపంచ జూనోసెస్ డేను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని ఏరియా వెటర్నరీ ఆస్పత్రిలో పశువైద్యశాఖ, యానిమల్స్ కేర్ సొసైటీ సంస్థ సహకారంతో యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. రేబిస్ అనేది ఒక తీవ్రమైన వైరల్ వ్యాధి అని.. ఇది పశువుల నుంచి మనుషులకు వ్యాప్తి చెందుతుందన్నారు. కుక్కకాటుతో ఈ వ్యాధి వస్తుందన్నారు. రేబీతో దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 20వేల మరణాలు జరుగుతున్నాయన్నారు. రేబీస్‌కు నివారణ చర్యగా పెంపుడు కుక్కలు, పిల్లులు, ఇతర పెంపుడు జంతువులకు ముందస్తుగా వ్యాక్సినేషన్ తప్పనిసరిగా ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా వెటర్నరీ ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, పశువైద్యులు ముక్కంటి రాజ్, సునీత, వంశీకృష్ణరెడ్డి, వెంకటేశ్, సహాయ పశువైద్య సిబ్బంది లావణ్య, శ్రీధర్, చంద్రశేఖర్, నజీర్, జగదీశ్వర్, దినేశ్, సలీం, యానిమల్స్ కేర్ సొసైటీ ప్రతినిధులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చేవెళ్ల: మూగజీవాల్లో వచ్చే అంటువ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ తిరుపతిరెడ్డి అన్నారు. చేవెళ్లలో ఆదివారం ప్రపంచ జూనోసెస్ డే సందర్భంగా మూగజీవాలకు ఉచిత రేబీస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహ్మద్ ఖలీల్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

మొయినాబాద్: జంతువుల నుంచి మానవులకు సంక్రమించే అత్యంత ప్రమాదకరమైన వ్యాధుల్లో రేబీస్ ఒకటని పశుసంవర్ధకశాఖ చేవెళ్ల డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి అన్నారు. ప్రపంచ జూనోసెస్ డే సందర్భంగా ఆదివారం మున్సిపాలిటీలోని ప్రాథమిక పశువైద్య కేంద్రంలో ఉచిత రేబీస్ వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహించారు.

మొయినాబాద్‌రూరల్: పెంపుడు శునకాలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్య అధికారి దేవిరెడ్డి సూచించారు. ఆదివారం మండలంలో రేబిస్ టీకాల కార్యక్రమాన్ని పశువైద్య అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల విశ్వకర్మ గౌరవ అధ్యక్షుడు వడ్ల నర్సింహాచారి, పశువైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



బంట్వారం: కరీంపూర్‌లో వేడుకలో ముస్లింలు



యాలాల: అన్నదానం నిర్వహిస్తున్న నాయకులు



దారూరు: కుక్కిందలో పీర్ల ఊరేగింపు



దుద్యాల్:తల్లిగోరు కింద నుంచి ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

కుల మతాలకతీతంగా ముస్లింలు ఆదివారం మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ముస్లింలు పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ఊరేగించి భక్తిభావాన్ని చాటుకున్నారు. అక్కడక్కడ అన్నదానాలు ఏర్పాటు చేసి షర్బత్ పంపిణీ చేశారు. అనంతరం పలువురు ముస్లింపెద్దలు, రాజకీయ నాయకులు మాట్లాడారు. ఈ పండుగ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు.



పూడూరులో పీర్ల ఊరేగింపు



మోమిన్‌పేట: టేకులపల్లిలో పీర్ల ఊరేగింపు సందర్భంగా సందడి



మోమిన్‌పేట: ఏన్కతలలో పీర్ల ఊరేగింపు



కుల్కచర్ల: పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దోమ: దిర్సంపల్లిలో సంబురాలు చేసుకుంటున్న ప్రజలు



ధారూరు: షర్బత్ పంపిణీ చేస్తున్న ముస్లిం నాయకులు



వికారాబాద్: శివారెడ్డిపేటలో పీర్ల ఊరేగింపు